సాక్షి రంగారెడ్డి

గురువారం, 6 ఫిబ్రవరి, 2025



కనీస వేతనం.. కలేనా?

పరిశ్రమల నిర్వాహకులు కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించడం లేదు. 8లో▸



మాదిగలకు 11 శాతం..

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ డిమాండ్ చేశారు. 8లో▸



వ్యసనాల బారిన పడొద్దు

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

రూ.10 కోట్లతో గ్రంథాలయ భవనాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా మరో నాలుగు నూతన గ్రంథాలయ భవనాలను నిర్మించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ నిర్ణయించింది. బుధవారం బడంగ్‌పేట్ జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించిన సర్వసభ్య, వార్షిక బడ్జెట్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్, మొయినాబాద్, కడ్తాల్, గండిపేటలో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాలను నిర్మించనున్నట్లు పేర్కొంది. పుస్తకాల కొనుగోలుకు రూ.50 లక్షలు, ఫర్నీచర్‌కు రూ.50 లక్షలు, గ్రంథాలయ వారోత్సవాలకు రూ.5 లక్షలు కేటాయించింది. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అదనపు అధికారి పూర్ణచందర్‌రావు, పౌర సంబంధాల శాఖ అధికారి పీసీ వెంకటేశం, వయోజన విద్య ప్రాజెక్ట్ ఆఫీసర్ అనిత, పంచాయతీ ఆఫీసర్ ఎం.సాధన, జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీని ఆదర్శంగా అభివృద్ధి చేయాలి

వ్యవసాయ మార్కెట్ రాష్ట్ర కమిటీ డైరెక్టర్ లక్ష్మీబాయి



లక్ష్మీబాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

షాబాద్: సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీని జిల్లాలోనే ఆదర్శ మార్కెట్ కమిటీగా అభివృద్ధి చేయాలని వ్యవసాయ మార్కెట్ రాష్ట్ర కమిటీ డైరెక్టర్ లక్ష్మీబాయి సూచించారు. బుధవారం నగరంలోని మార్కెటింగ్ కార్యాలయంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి మాట్లాడుతూ.. జిల్లాలో అతిపెద్దదయిన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని చైర్మన్ సురేందర్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్ తదితరులున్నారు.

సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలి

ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు



యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

హయత్‌నగర్: పెరుగుతున్న సాంకేతిక, వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు తమ సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలని హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు అన్నారు. కళాశాల విద్యాశాఖ ఆదేశానుసారం బుధవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకమైన ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు రూపొందించాలని.. ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషించేలా ఆవిష్కరణలుండాలని సూచించారు. ఫలితంగా ఆదాయం, పేరు ప్రఖ్యాతలు సంపాదించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు కావాల్సిన సమాచారం, సలహాలు, సూచనలు ఇస్తామని కోఆర్డినేటర్ యాదగిరి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, అకడమిక్ కోఆర్డినేటర్ నర్సింహ, ప్రోగ్రాం ఆఫీసర్ శారదాదేవి, నాగరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

10న మహా ధర్నా

మంచాల: ఈనెల 10న నగరంలోని ఇందిరా పార్కు వద్ద కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా మహా ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం బడుగుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా చేపడుతున్న ఈ మహాధర్నా కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కార్యదర్శి జంగయ్య , మండల కమిటీ సభ్యులు మమత, రాములు, స్వామి, కృష్ణ, గోపాల్, బుచ్చయ్య పాల్గొన్నారు.



లెక్క తేలింది

ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి

- ఒకటి, రెండు రోజుల్లో రిజర్వేషన్ల ఖరారు
- 15న స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్.?

జిల్లాలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య ఖరారయింది. గతంలో 257 స్థానాలుండగా 25 గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనమవడంతో ప్రస్తుతం వీటి సంఖ్యను 232కు పరిమితం చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు.. ఔటర్ లోపల ఉన్న పాత మున్సిపాలిటీల్లో సమీప గ్రామాల విలీనంతో జిల్లాలో ఎంపీటీసీ స్థానాలతో పాటు సర్పంచ్ స్థానాలు కొంత తగ్గాయి. ఇప్పటి వరకు జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా, కొత్తగా మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీల ఏర్పాటుతో వీటి సంఖ్య 18కి చేరింది. అదే విధంగా ఎంపీటీసీ స్థానాల సంఖ్య 257 నుంచి 232కు తగ్గింది. జిల్లా వ్యాప్తంగా గతంలో 558 గ్రామ పంచాయతీలు ఉండగా, ప్రస్తుతం 32 గ్రామాలు ఆయా మున్సిపాలిటీల్లో విలీనమవడంతో వీటి సంఖ్య 526కు చేరింది. ఇదిలా ఉండగా కొత్తగా మరికొన్ని గ్రామాలను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం అసెంబ్లీలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశంపై సమావేశాలు నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే. రిజర్వేషన్ల ప్రక్రియ ఒకటి రెండు రోజుల్లో ఖరారు అయ్యే అవకాశం ఉండడం, ఫిబ్రవరి 15న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడనుండడంతో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లోనూ ఎన్నికల హడావుడి మొదలైంది.

ఆయా మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలు ఇవే..

- శంకర్‌పల్లి మండలంలో 31 గ్రామాలు ఉండగా, 2018 ఆగస్టులో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం శంకర్‌పల్లి, పత్తేపూర్, రామంతాపూర్, సింగాపూర్, ముల్కాపూర్ గ్రామ పంచాయతీలను కలుపుతూ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. తాజాగా జన్వాడ, మిర్జాగూడలను నార్సింగి మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 13 నుంచి 11కి తగ్గాయి. గ్రామ పంచాయతీల సంఖ్య 26 నుంచి 24కు చేరింది.
- మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిలో మొయినాబాద్, పెద్ద మంగళారం, సురంగల్, ముర్తూజాగూడ, చిల్కూరు, ఎన్కేపల్లి, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్‌లతో ప్రభుత్వం కొత్తగా మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. గతంలో ఇక్కడ 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ప్రస్తుతం వీటి సంఖ్య తొమ్మిదికి తగ్గింది. ఇదే స్థాయిలో సర్పంచ్ స్థానాలు కూడా 20కి తగ్గాయి.
- చేవెళ్ల మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిలో చేవెళ్ల, దామరగిద్ద, దేవుని ఎర్రవల్లి, ఊరెళ్ల, రామన్నగూడ, మల్కాపూర్, కేసారం, ఇబ్రహీంపల్లి గ్రామ పంచాయతీలతో 2025 జనవరిలో చేవెళ్ల మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ప్రస్తుతం 12 స్థానాలకు పరిమితం చేశారు. దామరగిద్ద, చేవెళ్ల-1, చేవెళ్ల-2, దేవుని ఎర్రవల్లి, ఊరెళ్ల ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది.
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా, 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటిలో తారామతిపేట్, కుత్బుల్లాపూర్, గౌరెల్లి, బాచారం గ్రామాలను పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో నాలుగు సర్పంచ్ స్థానాలు, మూడు ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది.
- కొత్తూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా, 2018లో తిమ్మాపూర్ గ్రామ పంచాయతీతో కలిపి కొత్తూరు మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రస్తుతం పది ఎంపీటీసీ స్థానాలు ఉండగా, నాలుగు స్థానాలు తగ్గాయి. వీటిలో కొత్తూరు-1, కొత్తూరు-2, కొత్తూరు-3 సహా తిమ్మాపూర్ ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.
- శంషాబాద్ మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా, 12 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటిలో ఇటీవల చిన్న గొల్కొండ, పెద్దగోల్కొండ, శంకరా పురం, రషీద్‌గూడ, హమిదుల్లానగర్, బహదుర్‌గూడ గ్రామ పంచాయతీలను శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేసింది. దీంతో ఇక్కడ పెద్దగోల్కొండ, చిన్న గోల్కొండ, గాన్సిమియాగూడ ఎంపీటీసీ స్థానాలతో పాటు ఆరు సర్పంచ్ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది.

జిల్లా రాజకీయ స్వరూపం	
మండలాలు	21
ఎంపీటీసీ స్థానాలు	232
ఎంపీపీలు	21
జెడ్పీటీసీలు	21
గ్రామ పంచాయతీలు	526
వార్డులు	4,896
మొత్తం ఓటర్లు	7,94,653
పురుషులు	3,99,404
మహిళలు	3,95,216
ఇతరులు	33
మున్సిపాలిటీలు	15
మున్సిపల్ కార్పొరేషన్లు	3
అసెంబ్లీ నియోజకవర్గాలు	8

జీహెచ్‌ఎంసీ డివిజన్లు	
మహేశ్వరం	02
ఎల్బీనగర్	11
గచ్చిబౌలి	7
రాజేంద్రనగర్	5



రేవంత్‌రెడ్డి, భట్టి, మహేశ్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న చల్లా, సతీశ్ తదితరులు

పాలనలో రేవంత్ మార్క్

- కులగణన, వర్గీకరణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రిదే
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మొయినాబాద్ రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా కులగణన, ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరి సతీశ్, ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీం భరత్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అజీజ్ నగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ.. మాదిగలకు ఫిబ్రవరి 4 చారిత్రాత్మకం అన్నారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించడం దేశంలో చారిత్రాత్మక నిర్ణయాలన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాలు ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. వర్గీకరణకు కృషి చేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యంత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్, కాంగ్రెస్ నాయకులు డి.మహేందర్ రెడ్డి, భద్రప్ప, సత్యనారాయణ, బాలరాజ్, భిక్షపతి, వెంకట్‌రెడ్డి, కరణ్, మాధవరెడ్డి, హన్మంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం



ఉద్యోగాలు సాధించిన యువతులతో రాఘవేందర్‌రెడ్డి

టాస్క్ సీఈఓ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని టాస్క్ సీఈఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని టాస్క్ కార్యాలయంలో ఫ్యాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో వెల్దండ మండలానికి చెందిన 16 మంది మహిళలు ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో 3వేల మంది మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. జాబ్ రిక్రూమెంట్ డ్రైవ్‌ను నిరుద్యోగ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కొంగరకలాన్‌లో భూ సర్వే చేస్తున్న అధికారుల బృందం

‘ఫోర్త్ సిటీ’కి రెండో సర్వే

- పరిహారం కోసం భూములు పరిశీలించిన అధికారుల బృందం
- అడ్డుతగిలిన రైతులు
- నచ్చజెప్పిన అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఫోర్త్ సిటీ వరకు నిర్మించనున్న ఆరు లేన్ల రహదారికి అధికారులు బుధవారం జాయింట్ కమిటీతో సర్వే చేపట్టారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కలెక్టరేట్ కార్యాలయం వెనుక నుంచి రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, ఫారెస్టు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ల్యాండ్ అక్విజేషన్ అధికారులు సంయుక్తంగా ఈ సర్వే నిర్వహించారు. కొంగరకలాన్‌లో వంద మీటర్ల వెడల్పుతో 1.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 60 ఎకరాల భూమి అవసరం ఉండగా 36 మంది రైతులు భూములు కోల్పోనున్నారు. వారికి పరిహారం విషయమై రెండో సారి సర్వే చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ, పట్టాభూములు, అటవీ శాఖ భూములు ఎంత మేర ఉన్నాయో అంచనా వేశారు. సర్వే నిర్వహిస్తున్న సమయంలో కొంగరకలాన్‌కు చెందిన రైతు మౌలాలి అధికారులకు అడ్డు తగిలి భూమైనా ఇవ్వాలి.. లేదంటే సరైన పరిహారం అందజేయాలని నిలదీశాడు. పలువురు రైతులు అధికారులు వేసిన మార్కింగ్ తొలగించారు. ఇక్కడ నుంచి రోడ్డు నిర్మాణానికి వద్దంటూ భీష్మించారు. వారికి సరైన పరిహారం అందుతుందని అధికారులు నచ్చజెప్పారు. సర్వేలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పుష్పలత, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి విద్యాధరి, ఉద్యాన శాఖ అధికారి నవీన, ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి వినోద్, పోలీసులు ఉన్నారు.

పాఠశాల భవనం పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- ప్రిన్సిపాల్ మందలించాడని మనస్తాపం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



నీరజ్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: ప్రిన్సిపాల్ మందలించాడని మనస్తాపంతో ఓ విద్యార్థి పాఠశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం పట్టణంలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని సీఎస్‌కే వెంచర్‌లో నివాసం ఉంటున్న హరిభూషణ్ పటేల్, భాగ్య దంపతుల కుమారుడు నీరజ్(15) స్థానిక శాస్త్ర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం స్కూల్‌కు వెళ్లిన నీరజ్ స్నేహితుడితో కలిసి క్లాస్‌రూం నుంచి కారిడార్‌కు వచ్చాడు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ నరేందర్ రాయ్ వారిని మందలించాడు. దీంతో సాయంత్రం 4గంటలకు సుమారు 20 ఫీట్ల ఎత్తులో ఉన్న స్కూల్ అంతస్తు పైనుంచి నీరజ్ కిందికి దూకాడు.

రక్తపు మడుగులో..

పాఠశాల భవనం పైనుంచి దూకిన నీరజ్ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా.. పాఠశాల సిబ్బంది వెంటనే అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు వెంటనే చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు.



ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులు

విద్యార్థి నేతల ఆందోళన

విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ యువసత్తా యూత్ నాయకులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాల ఫర్నిచర్, అద్దాలు, బోర్డులు ధ్వంసం చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట బైఠాయించారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే ఆందోళనకారులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఏబీవీపీ నేతలు షాద్‌నగర్‌లో గురువారం పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

వార్షికోత్సవం మరుసటి రోజే విషాదం

హరిభూషణ్ పటేల్, భాగ్య దంపతులకు నీరజ్‌తో పాటు ఓ కూతురు ఉన్నారు. మంగళవారం హరిభూషణ్ దంపతుల పెళ్లి రోజు కావడంతో వారు కుటుంబ సభ్యులతో ఘనంగా వేడుక జరుపుకొన్నారు. మరుసటి రోజే కొడుకు మృతిచెందడంతో గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. ఆర్మీ జవాన్‌గా పని చేసిన హరిభూషణ్ రిటైర్మెంట్ తీసుకుని, ప్రస్తుతం బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యురాలు భవాని



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న భవాని

షాద్‌నగర్‌రూరల్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సభ్యురాలు భవాని సూచించారు. బుధవారం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతీ ఒక్కరికి ఎయిడ్స్‌వ్యాధిపై అవగాహన ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యాధి బారిన పడకుండా విద్యార్థులు వారిని చైతన్యవంతం చేయాలని సూచించారు. వివాహేతర సంబంధాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఒకే సిరంజిని ఎక్కువ మందికి ఉపయోగించడంతో హెచ్ఐవీ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా వారిని చేరదీయాలని అన్నారు. సమాజాభివృద్ధిలో భాగంగా ప్రతి విద్యార్థి విద్యతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని అన్నారు. ఆరోగ్య సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలే, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సృజన, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి అఫ్రోజా, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేయడం తగదు

- కులగణనతో కుట్రకు తెరలేపిన కాంగ్రెస్
- బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



బర్క కృష్ణతో నాగరకుంట బీసీ సంఘం నాయకులు

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కులగణన లెక్కల్లో బీసీలను తగ్గించి తప్పుడు లెక్కలు చూపుతున్న కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌కుంటలో బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణనతో బీసీలను అణచివేసే కుట్రకు కాంగ్రెస్ తెరలేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విధానం కొనసాగిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆపార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఇదే సమయంలో ఓసీ జనభాను పెంచి చూపుతోందని ఆరోపించారు. బీసీ సబ్ కమిటీలో భట్టి, పొన్నంను కాదని జానారెడ్డిని పెట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అవగతమవుతోందన్నారు. ఈ లెక్కల్లో లోపాలున్నాయని అధికారిక నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, అబ్బాస్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింలు, మల్లేష్, మచ్చేందర్, ఆనంద్, శ్రీకాంత్, శేఖర్, గోపాల్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

- మరొకరికి గాయాలు
- మోకిల వద్ద ఘటన, కేసు నమోదు


ఘటనా స్థలంలో గుమిగూడిన వాహనదారులు, స్థానికులు

శంకర్‌పల్లి: ఓ ప్రైవేటు పాఠశాల బస్సు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇంజనీరింగ్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని ఎన్‌సీడీ రాయల్ పెవిలియన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి మోకిల సీఐ వీరబాబు, స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా విజయవాడ అర్బన్ మండల కేంద్రానికి చెందిన శ్రీహర్ష(19)కు దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ సీటు వచ్చింది. దీంతో అతని తల్లి మోకిలతండాలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఇక్కడే ఉంటూ కొడుకును చదివిస్తోంది. శ్రీహర్ష నిత్యం బైక్‌పై కాలేజీకి వెళ్లివస్తుంటాడు. ఇదిలా ఉండగా బుధవారం కళాశాల ముగిసిన తర్వాత ఉప్పల్‌కు చెందిన క్లాస్‌మేట్ హర్షనందన్(19)ను తీసుకుని ఫ్రెషప్ అయ్యేందుకు మోకిలతండాకు వచ్చారు. సుమారు గంటపాటు రూంలో గడిపిన అనంతరం హర్షనందన్‌ను కాలేజీ వద్ద వదిలిపెట్టేందుకు బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఎన్‌సీడీ రాయల్ పెవిలియన్ సమీపంలో కొండకల్ వైపు అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న ఏపీ మోడల్ పాఠశాల బస్సు వీరిని బలంగా ఢీ కొట్టింది. బైక్ నడుపుతున్న శ్రీహర్షకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా.. హర్షనందన్ పాక్షిక గాయాలతో బయటపడ్డాడు. అతన్ని శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మోకిల పోలీసులు శ్రీహర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


వెంకటేశ్ (ఫైల్)

మీర్‌పేట: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ నాగరాజు కథనం ప్రకారం.. మీర్‌పేట ఓల్డ్ విలేజ్‌కు చెందిన ముక్కెర్ల వెంకటేశ్(50) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా ఆయన మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదు. దీంతో అతను నెల రోజులుగా మీర్‌పేట మంత్రాల చెరువు వద్దే ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వెంకటేశ్ చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

యువకుడి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... కాటేదాన్ బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన వికాస్‌సింగ్(25) జనవరి 18న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనం.. కలేనా?

- కాగితాలకే పరిమితమవుతున్న చట్టాలు
- పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలు
- పెరగని కార్మికుల జీతాలు
- పట్టించుకోని ప్రభుత్వాలు



కొత్తూరు: కార్మికుల శ్రమతోనే పరిశ్రమల నిర్వాహకులు రూ.కోట్ల లాభాలు గడిస్తున్నారు. అయినా తమ ఉన్నతికి కారణమైన శ్రమ జీవులకు యాజమాన్యాలు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రభుత్వాలు సైతం కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి కేవలం పరిశ్రమల యాజమాన్యాలకు మాత్రమే వత్తాసు పలుకుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటు నుంచి పలు విభాగాల్లో రాయితీలతో పాటు తీసుకున్న రుణాలను సైతం మాఫీ చేస్తూ వారికి అన్ని విధాలా సహకరిస్తున్నాయి. పరిశ్రమల్లో రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేస్తున్న కార్మికులు తమకు వచ్చే వేతనాలతో మూడు పూటల కడుపు నిండా తినే పరిస్థితి లేదు. వారి సమస్యల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకొని న్యాయం చేయాలని పలు కార్మిక సంఘాలు ధర్నాలు, ఉద్యమాలు చేస్తున్నప్పటికీ నేటికీ చలనం లేదు.

సవరణకు నోచుకోని చట్టం

కార్మిక చట్టాల ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతన చట్టాలను సవరిస్తూ కొత్త విధివిధానాలను ప్రకటించాలి. కాగా రాష్ట్రంలో గత పదిహేను సంవత్సరాలుగా చట్టాలను సవరించలేదు. పలు కార్మిక సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ఉలుకుపలుకు లేదు. దీంతో కార్మికులు కనీస వేతనాలకు నోచుకోక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఢిల్లీ, బెంగాల్‌తో పాటు పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం చట్టాలను సవరించి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న శ్రమజీవులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చే విధంగా చట్టాన్ని తీసుకొచ్చారు.


పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు (ఫైల్)

రూ.26 వేలు ఇవ్వాలి



ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులతో పాటు పలు రంగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. అయినప్పటికీ పరిశ్రమల నిర్వాహకులు జీవోలను తుంగలో తొక్కి రూ.9 నుంచి రూ.12 వేలు కూడా ఇవ్వడం లేదు. అంతర్రాష్ట్ర కార్మికులకు అదనంగా 50 శాతం జీతం ఇవ్వాల్సి ఉన్నా ఏ పరిశ్రమలో అమలు చేయడం లేదు.

– పర్వతాలు, ఏఐటీయూసీ, జిల్లా ప్రధాన కార్యదర్శి

శ్రమ దోపిడీ

కొత్తూరు మండలంలో తొమ్మిది భారీ తరహా, 150 వరకు మధ్య, చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి. అన్ని పరిశ్రమల్లో సుమారుగా 15 వేల మందికి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా పలు పరిశ్రమల నిర్వాహకులు కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుంటూ కనీస వేతనాలు ఇవ్వడం లేదు. అంతేకాకుండా వారిని నిబంధనలకు విరుద్ధంగా 8 గంటలకు బదులుగా 10 నుంచి 12 గంటల వరకు పనులు చేయించుకుంటున్నారు. మండలంలోని పరిశ్రమల్లో ఎక్కువగా బిహార్, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కార్మిక చట్టాలపై అవగాహన లేకపోవడంతో కాంట్రాక్టర్లు, పరిశ్రమ యాజమాన్యం కలిసి శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారు. కార్మికులకు కనీస వేతనాలను అందించాలని కార్మిక సంఘాలు ఆందోళనలు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పులు లేవు.

ప్రహరీ కూల్చివేత

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలోని రాళ్లగూడ సమీపంలోని సర్వే నంబర్: 601, 602లలో రహదారికి అడ్డంగా నిర్మాణం చేసిన ప్రహరీని బుధవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేశారు. రోడ్డు స్థలంలో ఉన్న గోడపై స్థానికులు ఫిర్యాదులు రావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. తమ సొంత పట్టాభూమిలో వేసుకున్న ప్రహరీని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా కూల్చివేసినట్లు స్థానికులు ఆరోపించారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలి


కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ

షాబాద్: మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సీతారాంపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం నాగర్‌గూడ వరకు ర్యాలీగా వెళ్లి ఎమార్పీఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కమిషన్ సిఫార్సుల్లో కులాల కేటాయింపులో అవకతవకలున్నాయని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడు జంగయ్య, సీనియర్ నాయకులు విశ్వంమాదిగ, అశోక్‌కుమార్ మాదిగ, వెంకటయ్య మాదిగ, రాజారత్నం మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు నర్సింలు మాదిగ, జిల్లా నాయకులు రామకృష్ణ, పామెన నర్సింలు, నాయకులు రాంచందర్, కృష్ణ, వెంకటేష్, సతీష్, ప్రవీణ్, ఆంజనేయులు, శ్రీను, రాములు తదితరులున్నారు.

ట్యాంకర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం


రాజునాయక్ (ఫైల్)

కేశంపేట: వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టోనిగూడ గ్రామ పరిధిలోని కాంకిరాళ్లతండాకు చెందిన వాంక్డావత్ రాజునాయక్(38) బైక్‌పై తండా నుంచి ఉదయం వేములనర్వ గ్రామానికి పని నిమిత్తం వచ్చాడు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులోని కోమటి చెరువు అలుగు దగ్గర వాటర్ ట్యాంకర్ అజాగ్రత్తగా నిలపడంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజు తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

వృద్ధురాలి మెడలో మంగళసూత్రం అపహరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి మెడలో ఉన్న మంగళసూత్రం అపహరించిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాఘవేంద్ర నగర్ కాలనీలో నివాసం ఉంటున్న పుల్లగుర్రం అనుసూయ(70), తన భర్తతో కలిసి ఒంటరిగా ఉంటున్నారు. ఈ విషయం గమనించిన ఓ వ్యక్తి ఈ నెల 3వ తేదీన ఉదయం ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు తెంపుకొని పరారయ్యాడు. ఈ విషయాన్ని ఆమె ఫోన్ ద్వారా పోలీసులకు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారించగా, అదే ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా 16 ఏళ్ల బాలుడు ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద మూడు తులాల బంగారు పుస్తెలతాడు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వ్యసనాల బారిన పడొద్దు

ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు


ర్యాలీలో ఏసీపీ రాజు, పోలీసు సిబ్బంది

యాచారం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకుల మైలారం గ్రామంలో బుధవారం సాయంత్రం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసులతో కలిసి ఏసీపీ గ్రామంలోని పలు కాలనీల్లో కలియ తిరిగారు. ప్రధాన చౌరాస్తాల్లో ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో సంచరించే కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు, యువత, మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజం రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ భవనం ప్రారంభం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర తెలిపారు. కిస్మత్‌పూర్‌లో సుమారు రెండు ఎకరాల స్థలంలో అధునాతన పద్ధతిలో 12.65 కోట్ల రూపాయలను వెచ్చించి కార్యాలయాన్ని నిర్మించారన్నారు. గురువారం ఉదయం కార్యాలయ భవనాన్ని మంత్రి శ్రీధర్‌బాబు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సహకార మార్కెటింగ్ సంఘ భవనం ప్రారంభం

శంషాబాద్ రూరల్: పాల్మాకుల వద్ద నిర్మించిన జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం నూతన భవనాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. కార్యాలయంతో పాటు దుకాణ సముదాయాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. రైతులకు అందుబాటులో ఉండేలా ఇక్కడ భవనాన్ని నిర్మించడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు సొసైటీల ద్వారా పొందే రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం


మాట్లాడుతున్న చంద్రయ్య

కొడంగల్ రూరల్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్స చంద్రయ్య ఆరోపించారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజానికానికి, వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకానికి నిధుల కొరత విధించిందన్నారు. బీమా రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం చూస్తోందని, వ్యవసాయ రంగాన్ని బడ్జెట్‌లో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు తదితర రంగాలకు నిధుల్లో కోత విధించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మైసప్ప, అనంతయ్య, మంగమ్మ, వెంకటమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

- మృతుల్లో ముగ్గురు యువకులు..ఓ యువతి
- నగరంలో విషాద ఘటనలు..ఆలస్యంగా వెలుగులోకి..

నగరంలో 18.. 28.. 29 ఏళ్ల వయసున్న ముగ్గురు యువకులు, 22 ఏళ్ల ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రేమ విఫలమైందని ఒకరు.. ఈ జీవితం నచ్చలేదంటూ మానసిక వేదనతో మరొకరు.. పరీక్ష సరిగా రాయలేదనే భయంతో ఓ యువకుడు, అనారోగ్యం వేధిస్తోందని ఓ యువతి ఉసురు తీసుకున్నారు. క్షణికావేశం.. జీవితమంటే ఏర్పడిన భయం.. మానసిక ఒత్తిడితో బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఎంతో భవిష్యత్తు ఉన్న నలుగురు ప్రాణాలు తీసుకోవడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

– గచ్చిబౌలి/మాదాపూర్/అమీర్‌పేట

ప్రియురాలికి వీడియో కాల్ చేసి..

ప్రేమ వ్యవహారంలో మనస్పర్థల కారణంగా ఓ యువకుడు ప్రియురాలికి వీడియో కాల్ చేసి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపిన ప్రకారం.. ఒడిశాలోని గంజాం జిల్లా జిల్లుండ జరడ గ్రామానికి చెందిన ధర్మ ప్రధాన్ (29) ఇరవై రోజుల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి రాయదుర్గంలోని అపర్ణ సైట్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. అక్కడే లేబర్ కాలనీలో నివాసం ఉంటూ మంగళవారం సాయంత్రం 4.55 గంటల సమయంలో ఓ యువతికి వీడియో కాల్ చేసి మాట్లాడుతూ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. అంతకు ముందు చేతిపై కత్తితో కోసుకొని..ఆ తర్వాత వీడియో కాల్ చేసినట్లుగా ఎస్ఐ రాములు పేర్కొన్నారు. ప్రేమ వైఫల్యమే కారణమై ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. వీడియో కాల్ అందుకున్న యువతి హైదరాబాద్‌లో మరో సైట్‌లో పనిచేస్తున్న తమ బంధువులకు ఫోన్‌చేసి ధర్మ ప్రదాన్ విషయాన్ని చెప్పి అప్రమత్తం చేసింది. వెంటనే వారు సైట్‌లోని లేబర్ కాలనీకి వచ్చి చూడగా యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం మృతుడి బంధువులు రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్య సమస్యలతో ఐటీ ఉద్యోగిని..


రితోజ బసు (ఫైల్)

అనారోగ్య సమస్యలతో ఐటీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం ఘటన జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రితోజ బసు(22) మాదాపూర్ సిద్ధిఖ్‌నగర్ జోలో స్టెర్లింగ్ కో లివింగ్ హాస్టల్‌లో స్నేహితునితో కలసి నివాసం ఉంటున్నారు. గచ్చిబౌలిలోని ఓ ఐటీ కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నారు. ఆమె స్నేహితుడు కోల్‌కత్తాకు చెందిన హర్ష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు కలిసి ఒక నెలక్రితమే హాస్టల్‌కు వచ్చారు. కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లి చేసుకుందామనుకున్నారు. ఈ లోపే అనారోగ్య సమస్యల కారణంగా ఒత్తిడికి గురైన రితోజ బసు హాస్టల్ భవనం ఆరవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవితం నచ్చలేదంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన ప్రకారం..జగిత్యాల జిల్లా బూగారం మండలం భోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గంతుల కుమార్ (28) ఎంబీఏ పూర్తి చేసి గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. బీకే గూడ సంజయ్ గాంధీనగర్ కాలనీలో గంగాధర్ అనే స్నేహితుడితో కలిసి ఉంటున్నాడు. బుధవారం ఉదయం గంగాధర్ బయటికు వెళ్లి తిరిగి 10 గంటల సమయంలో రూమ్‌కు వచ్చాడు. లోపలి నుంచి గడియ వేసి ఉండటంతో తలుపులు తట్టినా లోపల నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో కిటికీలో నుంచి చూడగా కుమార్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి విచారణ జరిపారు. గదిలో ఓ సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. 'నాకు జీవితం నచ్చలేదు. నన్ను క్షమించండి' అని నోట్ రాసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పరీక్ష భయంతో సీఏ విద్యార్థి

పరీక్ష సరిగా రాయలేదని ఓ సీఏ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాన్వి మండలం కరిటిగుడ్డ గ్రామానికి చెందిన రాజు శెట్టి కుమారుడు ఎస్.అమర్‌జీత్ (18) ఎస్ఆర్ నగర్ బాపూనగర్‌లోని జీవీ క్రేజీ పీజీ హాస్టల్‌లో ఉంటూ లక్ష్య కళాశాలలో సీఏ చదువుతున్నాడు. 2024 డిసెంబరు 22న పరీక్షలు రాసి సొంత గ్రామానికి వెళ్లాడు. పరీక్ష సరిగా రాయలేదని ఇంట్లో కుటుంబ సభ్యుల వద్ద బాధపడ్డాడు. ఫెయిల్ అవుతానేమో అని భయం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో గత జనవరి 27న మరో పరీక్ష రాయాల్సి ఉండటంతో తిరిగి నగరానికి వచ్చి హాస్టల్‌నే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లాల్సి ఉండగా ఆరోగ్యం బాగాలేదని రూమ్‌మేట్ సుబ్రమణ్యంతో చెప్పి గదిలో ఉండిపోయాడు. రాత్రి 10.30 గంటల సమయంలో సుబ్రమణ్యం వచ్చి చూడగా లోపలి నుండి లాక్ చేసి ఉంది. ఎంత పిలిచినా పలుకక పోవడంతో అనుమానం వచ్చి హాస్టల్ నిర్వాహకులకు చెప్పగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు తెరిచి చూడగా అమర్‌జీత్ ఉరి వేసుకుని కనిపించాడు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ జరిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.